## ఆవిర్భావ సంబురాలు



**ఉత్తమ ఉద్యోగిని సన్మానిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్**

రెబ్బెన, జూన్ 3: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్‌లో గల సీఈఆర్ క్లబ్‌లో రాత్రి సింగరేణి ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఉత్తమ ఉద్యోగులు, సేవా సభ్యులు, ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్, ఎస్‌వోటూజీఎం మచ్చగిరి నరేందర్, ఏరియా సేవా సమితి ఉపాధ్యక్షురాలు నళిని, ఏఐటీయుసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, పీఈ వీరన్న, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీవైపీఎం వేణు, సీనీయర్ పీవో ప్రశాంత్ ఉన్నారు.

## ప్రొటోకాల్ చైర్మన్‌ను కలిసిన ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ నాయకులు

దండేపల్లి, జూన్ 3 : తెలంగాణ ప్రభుత్వ ప్రొటోకాల్ చైర్మన్ వేణుగోపాల్‌ను తెలంగాణ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నాయకులు బోయిడి వెంగళరావు, సత్యనారాయణగౌడ్, సుభాష్‌రావు తదితరులు ఉన్నారు.

## తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ

మంచిర్యాల ఏసీసీ, జూన్ 3: జిల్లా కేంద్రంలోని ఆర్ ఆర్ నగర్‌లో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. సోమవారం ఇంటి యజమాని వార్ల రాజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆరోగ్య పరీక్షల నిమిత్తం మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి వెళ్లారు. సోమవారం ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది, తులం బంగారం, రూ.40 వేలకు పైగా నగదు చోరీకి గురికావడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

## కోతుల దాడిలో ఓరియంట్ కంపెనీ ఉద్యోగి మృతి

కాసిపేట, జూన్3: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ పర్మినెంట్ ఉద్యోగి మేకల రాకేశ్(46) కోతుల దాడిలో మృతి చెందాడు. వారం క్రితం విధులకు వెళ్లిన రాకేశ్‌పై ఒక్కసారిగా కోతులు దాడి చేశాయి. దీంతో సైడ్ రేలింగ్‌పై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కంపెనీ యాజమాన్యం వెంటనే ఓరియంట్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మంచిర్యాలలోని దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ క్రమంలో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం రాకేశ్ మృతదేహంతో కుటుంబ సభ్యులు, కార్మికులు ఓరియంట్ కంపెనీ ఎదుట ఆందోళనకు దిగారు. రూ.10లక్షల పరిహారం, ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకారించడంతో ఆందోళన విరమించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా దేవాపూర్ ఎస్‌ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు తిరుతిరెడ్డి, నాయకులు కొమ్ముల బాపు, మడావి అనంతరావు, ఆత్రం జంగు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, గొంది వెంకటరమణ, ఆడె జంగు, కనక రాజు, మేరుగు శంకర్, తత్ర భీంరావు, సోయం సూరు తదితరులు పాల్గొన్నారు.

# రెండో విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

నస్పూర్, జూన్ 3 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలోని చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు మే 13 జరిగిన ఎన్నికలకు సంబంధించి మంగళవారం జరగనున్న ఓట్ల లెక్కింపు కోసం అవసరమైన పోలింగ్ సిబ్బంది రెండో విడుత ర్యాండమైజేషన్ పూర్తి చేశామని ఎన్నికల అధికారి, మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో కౌంటింగ్ పరిశీలకులు విజయ ఈ రవికుమార్ సమక్షంలో అదనపు కలెక్టర్‌లు రాహుల్, మోతిలాల్, ఆర్డీవో రాములు, ప్రత్యేక ఉప పాలనాధికారి చంద్రకళతో కలిసి కౌంటింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి 14 సాధారణ టేబుళ్లు, 1 పరిశీలకుల టేబుల్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్ వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఉంటారని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 18 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, 18 మంది కౌంటింగ్ సహాయకులు, 18 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. కార్యక్రమంలో డీఈవో యాదయ్య, లీడ్ డిస్టిక్ మేనేజర్ తిరుపతి , ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఈ డిస్ట్రిక్ మేనేజర్ సునీల్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



**ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్**

### గ్రూప్ 1 అభ్యర్థులు ఉదయం 10 గంటలలోగా కేంద్రాలకు చేరుకోవాలి

జూన్ 9న జిల్లాలో గ్రూప్ 1 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 10 గంటలలోగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 27 పరీక్షకేంద్రాలను ఏర్పాటు చేశామని, 9384 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేశామన్నారు. కేంద్రాల్లో ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్, మందులతో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచామ న్నారు. పరీక్ష సజావుగా సాగేలా అధికారులు కృషి చేయాలన్నారు.

# హామీల అమలుకై పోరాడుతాం

**ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య**

శ్రీరాంపూర్, జూన్ 3 : సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో తాము ఇచ్చిన హామీల ఆమలుకై పోరాడుతామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ సీతారామయ్య పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఆర్కే 7గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల ఇంటి రుణాల వడ్డీ గతంలో 8.3 కంటే తక్కువగా ఉంటే తక్కువగానే ఇచ్చేవారన్నారు. తాము 8.3 శాతం వడ్డీని చెల్లించడానికి యాజమాన్యంతో మాట్లాడి ఇప్పించామన్నారు. కార్మికులు గతంలో ఇల్లు నిర్మించుకొని సంవత్సరంలోపు లోనుకు దరఖాస్తు చేసుకుంటే లోను ఇచ్చేవారని, సంవత్సరం దాటితే లోను ఇచ్చే వారు కాదన్నారు. ఇప్పుడు ఆనిబంధన సడలింపు చేశారు. సీఎంపీఎఫ్ లోను పట్టుకున్న కార్మికులకు ఎటువంటి పైరవీలు లేకుండా 10 నెలలుగా పెండింగ్‌లో ఉన్న సీపీఎంపీఎఫ్ లోన్ల పరిష్కారం చేశామన్నారు. ఈ కర్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఫిట్ కార్యదర్శులు బీ రవీందర్, నాయకులు మురళీచౌదరి, ఆకుల లక్ష్మణ్, గొల్లపల్లి రాంచందర ప్రతాప్, రాజేందర్, సదానందం, చంద్రశేఖర్, రవితేజ, సారయ్య పాల్గొన్నారు.



**సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య**

# విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తా

- విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్
- జన్నారం సబ్ స్టేషన్ సదర్శన



**జన్నారం సబ్ స్టేషన్‌లో ఎస్ఈ శ్రావణ్‌కుమార్‌కు సమస్యలు విన్నవిస్తున్న నాయకులు**

జన్నారం, జూన్ 3 : జన్నారం మండలంలో ఇకపై విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూస్తామని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. జన్నారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. టీఎస్ ఎన్‌పీడీసీఎల్ ఎండీకి విద్యుత్ సమస్యలపై వినియోగదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాను ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలకు గల కారణాలను ఉద్యోగులను అడిగి తెలుసుకున్నామని పేర్కొన్నారు. ఇక ముందు సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్ఈ శ్రావణ్‌కుమార్‌ను మండల నాయకులు మర్యాదపూర్వంకంగా కలశారు. సమస్యలను ఆయనకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఏనుగు శుభాష్ రెడ్డి, మల్యాల బాపన్న, మధుసూదన్‌రావు, కొంతం శంకరయ్య, ముత్యం రాజన్న, సుధీర్, ఏఈ లచ్చన్న, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశంసా పత్రం అందజేత



**ప్రశంసాపత్రం అందజేస్తున్న సదాశయా ఫౌండేషన్ సభ్యులు**

శ్రీరాంపూర్, జూన్ 3 : శ్రీరాంపూర్ ఆర్కే 8కాలనీలో నివసిస్తూ నేత్రదానం చేసి మృతి చెందిన పోతునూరి సత్యనారాయణ సంస్మరణ సభలో సోమవారం నిర్వహించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదిర్శ చౌడవరపు లింగమూర్తి పాల్గొని సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతీ ఒక్కరు అవయవదానం చేసి తోటి వారికి సహాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కర్రె మొగిలి, మహిపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, కే రాజయ్యలూ అవయవదానం చేయడానికి ముందుకు రాగా వారికి ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నేత్రదానం చేసిన సత్యనారాయణ కుమారుడు శ్రీనివాస్, కోడలు స్నేహలత, సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్‌లో హరితహారం



**మొక్క నాటుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు**

సీసీసీ నస్పూర్, జూన్ 3 : సీసీసీ నస్పూర్ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మధుబాబు జన్మదినం సందర్భంగా కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వివిధ డిపార్ట్‌మెంట్ల హెచ్‌వోడీలు, అధ్యాపకులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. హరితహారంలో భాగంగా కళాశాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించామని, మొత్తం పచ్చని చెట్లతో కళాశాల కళకళలాడుతున్నదని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.

## మూడు ద్విచక్ర వాహనాలు ధ్వంసం

జైపూర్, జూన్ 3 : జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందారం బస్టాండ్ వద్ద రాజీవ్‌రహదారిపై సోమవారం రాత్రి మహేంద్ర ట్రాలీ అదుపు తప్పి వ్యాపారసముదాయాలపైకి దూసుకువచ్చిన ప్రమాదంలో మూడు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న ట్రాలీ వాహనం నం టీఎస్ 22టీఏ 1668 గల వాహనం వేగంగా రోడ్డు పక్కన గల షాపులపైకి దూసుకెళ్లింది. అక్కడ పార్కింగ్ చేసి ఉన్న మూడు ద్విచక్రవాహనాలు ధ్వంసం అయ్యాయి. ప్రమాద సమయంలో వ్యాను నడుపుతున్న డ్రైవర్ వికలాంగుడు కాగా మద్యం సేవించి ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


